# “యేసు కన్నీళ్లు విడిచెను”

# (11:1-44)

1993లో “ఛాయాభూములు” అనే సినిమా గొప్ప రచయిత సి. ఎస్. లూయిస్ మరియు జాయ్ గ్రెస్‌హేమ్‌లకు సంబంధించిన చేదు తీపి ప్రేమ గాధను తెలుపుతుంది. ఆ ప్రదర్శనకు ఆరంభం, జనులతో నిండిన హాలులో, బాధ అనే అంశం మీద లూయిస్ ఉపన్యసించాడు. అతడు వారికి యిలా చెప్పాడు,

> చెవిటి లోకాన్ని రేపడానికి బాధ అనేది దేవుని పెద్ద పోనైయుంది ... శిల్పి మానవ రూపాలను చెక్కడానికిగాను మనము రాతి బండలవంటి వారమైయున్నాం. ఉలి యొక్క దెబ్బలు మనకు బాధ కలిగిస్తాయి అవే మనలను పరిపూర్ణులుగా చేస్తూ ఉంటాయి.

ఆ ప్రదర్శన జరుగుతుండగా, లూయిస్ జాయ్ గ్రెస్‌హేమ్‌ను కలిసికొన్నాడు. ఆమె అతని ప్రేమలో పడింది. కఠిన బ్రహ్మచారియైన లూయిస్ మొదట్లో జాయ్‌తో కేవలం స్నేహంవరకే యిష్టం కలిగియున్నాడు. తన మేడగదిలో ఒక మధ్యాహ్నపు వేళ వారిద్దరు టీకి కూర్చున్నప్పుడు, లూయిస్‌పై జాయ్ కలతతో మండిపడింది. ఆమె యిలా పెద్దగా అరిచింది,

> నేను యిప్పుడు మాత్రమే దాన్ని చూచాను – ఎవరు నిన్ను తాకకుండునట్లు నీ జీవితాన్ని నీ కొరకు నీవే అమర్చుకున్నది. నీకు సమీపంగా ఉన్న ప్రతి ఒక్కరు నీకంటె చిన్నవారైనా, లేక బలహీనులైనా లేక నీ అదుపులో ఉన్నవారైనా అయ్యున్నారు.

మెల్లగా, అనుకంపాలు (ఫీలింగ్స్) గాని, బాధలు గాని తాకకుండేలా తన జీవితాన్ని కట్టుబాట్లలో ఉంచుకున్న తన విధానాన్ని గూర్చి జాయ్ సరిగా చెప్పియున్నట్టు అతడు గ్రహించాడు. తరువాత, జాయ్ ఆస్పత్రిలో క్యాన్సర్‌తో ఉన్నప్పుడు, ఆమెతో పెండ్లికి ప్రపోజ్ చేసి; 1956లో వారిద్దరు భార్యాభర్తలయ్యారు. వారి సుఖ సంతోషాలపై క్యాన్సర్ మేఘం ఎల్లప్పుడు నిలిచియున్నప్పటికిని తరువాత నాల్గు సంవత్సరాలు వారికి బహు అద్భుతమైన సంవత్సరాలుగా గడిచిపోయాయ్. ఈ కాలంలో వ్యవధానంతో జరిగిన హనీమూన్ ప్రయాణంలో వారి గోడ మీద చిత్రలేఖనంలో ఉన్న రమ్యమైన లోయకు వారు వెళ్లారు. వారు పొలములో నడుస్తున్నప్పుడు వర్షం కురువనారంభించింది. ఎండు గడ్డి భద్రం చేయబడిన ఒక పాకలో వారు తల దాచుకోడానికి వెళ్లారు. వారు అక్కడ కూర్చుండియుండగా రానున్న ఆమె మరణాన్ని గూర్చి చర్చించాలని జాయ్ పట్టుపట్టింది. నిబ్బరమైన గళంతో ఆమె యిలా అంది,

ఈ వర్షం ఆగి మనం వెళ్లకముందు ఈ విషయం నన్ను చెప్పనివ్వు. ... నేను చావబోతున్నాను అప్పుడు కూడా నేను నీతో ఉండగోరతాను. నేను దాని చేయగల ఒకే విధానం, నేను యిప్పుడు నీతో మాట్లాడగలగడమే ... అది మేనేజ్ చేయడం కంటె శ్రేష్ఠమైయ్యిందని నేను అనుకుంటాను. నేను చెప్పేదేమంటే, అప్పటి బాధ యిప్పటి సంతోషంలో భాగమైయుంటుంది. ఇదే ఆ వ్యాపార భాగం.

తరువాత, జాయ్ మరణించినప్పుడు, జాయ్ యొక్క ఎనిమిది సంవత్సరాల బిడ్డయైన డగ్లస్‌తోబాటు, లూయిస్ ఆ నష్టంచేత బహుగా క్రుంగదీయబడ్డాడు. ఆ బాలుడు వెళ్లి ఏకాంతంగా ఉండగోరే పై అంతస్థు మీదనున్న చిన్న గది వద్దకు అతడు నడిచివెళ్లిన రోజువరకు వారిద్దరు మౌన ప్రపంచంలో బాధననుభవించారు. ఏమి చెప్పాలో నిశ్చయంగా తెలియని లూయిస్ ఆ బాలుని చెంత కూర్చున్నాడు. దాని తరువాత వారిరువురి మధ్య జరిగిన సంభాషణ ఆ సినిమాలో బహు శక్తివంతమైన సందర్భాన్ని సూచిస్తుంది. లూయిస్ తన కొడుకు డగ్లాస్‌తో అతడు తన తల్లిని చాలా చిన్న వయస్సులో పోగొట్టుకున్నాడని అనడంతో, వారు మరణాన్ని గూర్చి చర్చించుకో నారంభించారు:

డగ్లస్: నీకు పరలోకం అంటే నమ్మకం ఉందా?
లూయిస్: "అవును, నేను నమ్ముతున్నాను."
డగ్లస్: పరలోకం అంటే నాకు నమ్మకం లేదు.
లూయిస్: అయితే ఫరవాలేదు.
డగ్లస్: ఆమెను నేను తిరిగి తప్పక చూడగోరతాను.
లూయిస్: "నేను కూడా!"

అప్పుడు వారిరువురు ఏడ్వనారంభించారు. లూయిస్ ఆ బాలుని కౌగలించుకున్నాడు. వారిద్దరు కలిసి ఏడ్వనారంభించారు. ఆ ప్రదర్శన అంతంలో, లూయిస్ ఆ పల్లెసీమ గుండా నడుచుకొంటూ వెళ్లాడు, డగ్లస్ తన కుక్కతోపాటు ప్రక్కనున్న పొలం గుండా పరుగెత్తాడు. సహజంగానే, వారిద్దరి మధ్యనున్న ప్రేమ, స్నేహ బంధాలు పెరిగాయి. వారు కలిసి బాధ అనుభవించినందున, వారిరువురి మధ్యనున్న బాంధవ్యం శాశ్వతంగా మారిపోయింది.

మన పాఠ్యాంశానికి సంబంధించిన లేఖన భాగంలో, 11:1–44, తన ప్రియమైన స్నేహితుడగు లాజరు సమాధి వద్ద ప్రభువైన యేసు నిలిచియున్నప్పుడు ఈ కథ చెప్పబడింది. "ఆ వాక్యము శరీరధారియై" (1:14) మన మధ్య నివసించిన విధానాన్ని ఆ కథ ప్రదర్శిస్తుంది. దుఃఖ సమయంలో తనకు తానే వచ్చి మన బాధా ప్రపంచంలో ప్రవేశించినట్లు, మన విచారమందు ఆయన మనతో కూర్చున్నట్టును సూచిస్తుంది. బాధకు కారణాన్ని గూర్చిగాని, వేదనకు అర్థం గూర్చిగాని ఆయన ఉపన్యసించడు; ఆయన మన కన్నీటితో తన కన్నీటిని జతచేస్తాడు. దీనియందు మనం ఎదురు చూడని ఆదరణను, దేవునితో గాఢమైన సహవాసాన్ని కనుగొంటాం.

యోహాను 11ను అనేక విధానాలలో చదువవచ్చు. ఈ వరుసలో యింకా రెండు పాఠాలను ఈ అద్భుతమైన లేఖన భాగానికి కేటాయించబడతాయి. ఈ అధ్యాయంనుంచి చేసే తొలి ప్రయాణంలో, మనోభావాల మీదను, ఉద్వేగాల మీదను దృష్టి నిలుపగోరదాం.

## ప్రేమ

బేతనివాడైన లాజరు రోగియై పడియున్నాడు. ఆ రోగి యొక్క సహోదరీలైన మరియ, మార్తలచే ప్రభువైన యేసునకు వర్తమానం పంపబడింది (1 వ.). "–ప్రభువా, యిదిగో నీవు ప్రేమించువాడు రోగియై యున్నాడని" వారు ఆయనకు వర్తమానము పంపారు (3 వ.). ప్రథమంగా అది వింతైన బాషగా గోచరిస్తుంది. యేసు ప్రతి ఒక్కరిని ప్రేమించలేదా ఏమి? "నీవు ప్రేమించినవాడని" ఎవడైనా ఒక్కడు ఎలా వర్ణింపబడగలడు? యేసు లోకంలోని ప్రతివారిని ప్రేమించాడు, ప్రేమిస్తున్నాడు; అయితే ఆయనకు ప్రత్యేకమైన స్నేహితులు ఉండరని దాని అర్థం కాదు. లాజరు, మరియ, మార్తలు అనేవారిని ప్రభువుకు యిష్టులైయున్నారని ప్రశంసించడానికి నీకు నీవే ఒక చిన్న ప్రశ్న వేసికో. ఉదయం 2:00 గంటల ప్రాంతంలో నీకు అత్యవసరమైన పరిస్థితి ఏర్పడితే నీవు ఎవరిని పిలుస్తావు? ప్రభువైన యేసైతే ఈ ముగ్గురు స్నేహితులను పిలిచేవాడు.

యేసు వారి సందేశాన్ని అందుకున్నప్పుడు, ఆయన తన శిష్యులవైపుకు తిరిగి – "యీ వ్యాధి మరణము కొరకు వచ్చినది కాదు" (4 వ.) అది "దేవుని మహిమ కొరకు" వచ్చిందని అభయమిచ్చాడు (4బి వ.). ఈ ముగ్గురి విషయంలో యేసుకున్న ప్రత్యేకమైన మనో భావాలను యోహాను యొక్క రచన మనకు గుర్తు చేస్తుంది: "యేసు మార్తను ఆమె సహోదరిని లాజరును ప్రేమించెను" (5 వ.).

రెండు దినాలైన తరువాత, లాజరును చూడడానికి యూదయకు వెళ్లవలసిందని యేసు తన శిష్యులతో చెప్పాడు. యూదా మత నాయకులు యేసును ఎంతగా ద్వేషించి ఆయనను చంప వెదకుతున్నారో ఎరిగిన శిష్యులు ఆయనను వెళ్లకుండా ఆపాలని యత్నించారు. అయినా, యేసు వెళ్లాలని పట్టుబట్టి "–మన స్నేహితుడైన లాజరు నిద్రించుచున్నాడు; అతని మేలుకొలుప వెళ్లుచున్నానని" వారితో చెప్పాడు (11బి వ.). లాజరుతోను అతని సహోదరీలతోను ఆయనకున్న ప్రత్యేకమైన బాంధవ్యాన్ని ఆయన భాష సూచిస్తుంది. ఆయన మాట్లాడిన నిద్ర నిజంగా మరణానికి సంబంధించింది. తరువాత ఆయన "లాజరు చనిపోయెను" అని వారికి తెలిపాడు (14 వ.). యూదయకు వెళ్లడం వారందరికి ప్రాణ సంకటమని తోమా ఎరిగినవాడై, "–ఆయనతో కూడ చనిపోవుటకు మనమును వెళ్లుదమని తనతోడి శిష్యులతో" చెప్పాడు (16 వ.). అతని పలుకులలో భయమును నమ్మకమును కలిసియున్నట్టు కన్పిస్తుంది.

## నిరాశ

యేసు బేతనియకు వచ్చినప్పుడు, లాజరు యొక్క మృత దేహము అప్పటికే నాల్గు దినాలుగా సమాధిలో ఉంది. ప్రభువు ఆ ఊరిలోనికి ప్రవేశింపక మునుపే, ఆయన వస్తున్నట్టు మార్త విని ఆయనను కలిసికొనడానికి ఎదురుగా వెళ్లింది. ఆమె ఆయనను చూచినప్పుడు యిలా అంది: "ప్రభువా, నీవిక్కడ ఉండినయెడల నా సహోదరుడు చావకుండును" (21 వ.). ఆమె పలుకులలో ఉన్న నిరాశయను తీవ్రమైన కొనను నేడు కూడా చదువరి "వినవచ్చు." "నీవు ఉంటేనే" అనేది ఏ భాషలోనైనా దుఃఖపూరితమైన

భావనయై ఉంటుంది. లాజరు రోగియైయున్నాడనే వర్తమానం తెచ్చినవారు యేసును చేరే సమయానికే అతడు చనిపోయి ఉండవచ్చు. వారి వద్దకు వచ్చుటలో ప్రభువు జాగు చేసినందుకు మార్త గాయపరచబడియుండవచ్చు. యేసు అక్కడ నిలిచి, "దానిని భరించాడు." ఆమె బాధ, ఆమె దిగ్భ్రమ, ఆమె నిరాశను వెళ్లగ్రక్కనిచ్చాడు.

## కన్నీరు

క్లుప్తంగా కొన్ని మాటలు పలికిన తరువాత, మార్త తన యింటికి తిరిగి వెళ్లి, తన సోదరితో, "–బోధకుడు వచ్చి నిన్ను పిలుచుచున్నాడని" రహస్యంగా చెప్పింది (28 వ.). తానేమి చేస్తున్నది వివరించకుండగనే, మరియ లేచి యేసును కలిసికొనడానికి బయలుదేరింది. ఆమె లాజరు సమాధి వద్దకు వెళ్లి ఏడ్వబోతుందని యోచించిన – యెరూషలేమునుండి బేతనియకు వచ్చిన యూదులు ఆమెతో కూడ వెళ్లారు.

మరియ యేసు వద్దకు వచ్చినప్పుడు, ఆమె "ఆయన పాదముల వద్ద పడింది" (32 వ.), దానికి భిన్నంగా ఆమె సోదరియైతే తనను తాను అదుపులో ఉంచుకొన్నదై, ముందుగా ప్రభువుతో ముఖాముఖిగా మాట్లాడినట్లు గమనించాం. మరియ యేసు పాదముల వద్ద కూలబడిందంటే, తన గర్వాన్ని గూర్చిగాని, కన్పించే తీరును గూర్చిగాని పట్టించుకున్నది కాదు. తన హృదయంలోని వేదన ఉద్వేగాలన్నింటిని మించినది. అప్పుడు, మరియ తన సహోదరి పలికిన మాటలనే పలికింది: "ప్రభువా, నీవిక్కడ ఉండినయెడల నా సహోదరుడు చావకుండును" (32 వ.).

తరువాత జరిగిందేదో అది కథయొక్క "ముఖ్య భాగమై"యుంది. యోహాను యిలా వ్రాశాడు:

> ఆమె ఏడ్చుటయు, ఆమెతో కూడ వచ్చిన యూదులు ఏడ్చుటయు యేసు చూచి కలవర పడి ఆత్మలో మూలుగుచు – అతని నెక్కడ నుంచితిరని అడుగగా, వారు – ప్రభువా, వచ్చి చూడుమని ఆయనతో చెప్పిరి. యేసు కన్నీళ్లు విడిచెను (33–35 వచ.).

యోహాను మరపురాని విధంగా కొద్ది మాటలలో వర్ణించాడు – ఆ సోదరీల బాధ ప్రభువైన యేసుపై దాని ప్రభావాన్ని కనుపరచింది. ఆయన "లోతుగా కదిలింపబడ్డాడు." నేడు, వారి బాధ "ఆయనకు వచ్చింది" అని అంటాం. వారు పడుతున్న ఆవేదనను ఆయన తన హృదయంలోనికి రానిచ్చాడు. అయినా ప్రభువు అక్కడ ఏడ్చుచున్న యితరులవలె కాని, ఆ సోదరులవలె కాని ఏడ్చినవాడు కాదు. అది దిగమింగుకున్న దుఃఖమై ఉండవచ్చు. లేదా ఒక వ్యక్తి అన్నట్టు "మృదువైన కన్నీటి వాన" కావచ్చు. "కన్నీళ్లనేవి ఆత్మ గాయాల్లోని రక్తంవలె ఉంటాయని" నైసావాడైన గ్రెగరీ వ్రాశాడు.[1] దుఃఖములో మునిగియున్న కుటుంబం కొరకు ప్రభువు హృదయం గాయపడింది. ఆయన వారితో కన్నీళ్లు విడిచాడు.

ఈ సంఘటనను వీక్షించినవారు – "అతనిని ఏలాగు ప్రేమించెనో చూడుడని చెప్పుకొనిరి" (36 వ.). యేసును ఈ సమయంలో కూడివచ్చిన వారు ఎంతగా అపార్థం చేసికొన్నారో యోహాను సూచించినట్టు కొందరు తలంచారు. నేను సమ్మతించను. అక్కడ

ఏమి జరుగుతుందో దానిని వర్ణించడానికి యోహాను ఆ మాటలు వాడినట్టు నేను నమ్ముతాను. వారు ఆయనకు ప్రియమైన స్నేహితులు, మరియు వారి నష్టమే ఆయన నష్టం.

లాజరు యొక్క మృత దేహం ఎక్కడ ఉంచబడిందో అడిగాడు, మరియు ఆయన సమాధి యొద్దకు వెళ్లాడు. "యేసు మరల తనలో మూలుగుచు" సమాధి వద్దకు చేరుకున్నట్టు యోహాను తెలిపాడు (38 వ.).[2] మనం అడుగవలసిన ప్రశ్న ఏమంటే – "యేసు కన్నీళ్లకు అర్థం ఏమిటి?" లాజరు చనిపోయినందుకు ఆయన కన్నీళ్లు విడిచాడా? కొద్ది క్షణాల్లో లాజరును బ్రదికింపబోతున్నట్టు ఆయన ఎరుగు. మరి, ఇతరులయందు ఆయన చూచిన బాధవలన కన్నీళ్లు విడిచాడా? అయ్యుండవచ్చు. మరల, త్వరలోనే వారి దుఃఖము ఎన్నడూ వారు అనుభవించని మహా గొప్ప సంతోషముగా మారిపోబో తుందని కూడా ఆయనకు తెలుసు. తన స్నేహితులలో ఉన్న విశ్వాసపు లేమిని ఆయన చూచినందున కన్నీళ్లు విడిచాడని కొందరన్నారు. అలా అనుకుంటే, తన పరిచర్యలో యేసు ఎంతో అవిశ్వాసాన్ని చూచాడు, అందుకు ఆయన మాదిరి ప్రత్యుత్తరం కన్నీళ్లు విడవడం కాదు.

మానవత్వాన్ని ఆయన ఎంత సంపూర్ణంగా అనుభవించాడో దానిని నిరూపించడమే ఆయన ముఖం మీద కన్నీరు కారడం. సి. ఎస్. లూయిస్ కథను జ్ఞాపకం చేసికొంటే, యేసు ఈ లోకమునకు అరుదెంచి, మనతో కూర్చుండి, విలపిస్తున్నాడు!

## ముగింపు

ఒక రకమైన జ్వరంతో రోగిగా ఉన్న తన సోదరునికి మారుగా 1864లో డామియన్ డి వెస్టెర్ (1840–89) హవాయికి మిషినెరీగా వెళ్లాడు. ఆ ద్వీపంలో తొమ్మిది సంవత్సరాల కష్టమైన క్రైస్తవ పని తరువాత, డానియన్, కుష్ఠరోగుల బలవంత నివాసమైన మెలొకాయ్ ద్వీపానికి వెళ్లాలని స్వయంగా కోరుకున్నాడు. అక్కడ అతడు, నర్స్‌గాను, నిర్మాణకుడుగాను, తాపీ పనివాడుగాను, (డాక్టర్) వైద్యుడుగాను, కాటి కాపరిగాను, శవ పేటికలు చేయువాడుగాను, సమాధులకు గోతులు త్రవ్వువాడుగాను పని చేశాడు. ఆ ద్వీపంలో రెండు అనాథ ఆశ్రయాలను నిర్మించి, నిర్వహించాడు కూడా. ప్రతి ఆదివారం అతడు ప్రసంగించుచూ, "కుష్ఠరోగుల్లారా దేవుడు మిమ్మును ప్రేమిస్తున్నాడని మీకు తెలుసు" అని ప్రారంభిస్తాడు. ఒక రోజున డామియన్‌కు కూడా కుష్ఠరోగం సోకినట్టు కనుగొన్నాడు. మరుసటి ఆదివారాన ప్రసంగించడానికి అతడు నిలిచినప్పుడు, "కుష్ఠరోగులమైన మనలను దేవుడు ప్రేమిస్తున్నట్టు మనకు తెలుసు" అని ఆరంభించాడు.

లాజరు సమాధికి వెలుపల నిలిచిన యేసు యొక్క రూపచిత్రం – మానవత్వపు సంపూర్ణతను ఆయన అనుభవించాడని స్పష్టంగా జ్ఞప్తి చేయడమే అయ్యుంటుంది. ఆయన 50 శాతం నరుడు, 50 శాతం దేవుడు కాదు. ఆయన నూటికి నూరుపాళ్లు నరుడైయుండి, నూటికి నూరుపాళ్లు దేవుడుగానే మిగిలిపోయాడు. ప్రభువైన యేసు మన లోకంలోనికి ప్రవేశిస్తాడు, మన బాధలననుభవిస్తాడు, మన కన్నీటిని ఆయన కార్చుతాడు. ఇదంతా "దేవుడు మనలను ప్రేమిస్తున్నట్టు మనమెరుగుదుమనే" సందేశాన్ని అందించడానికే.

సూచనలు

[1]Quoted in Richard Foster, *Prayer* (San Francisco: Harper, 1992), 37. [2]33, 38 వచనాలలో *embrimaomai* అనే గ్రీకు పదం – "మూలుగుచు" అని తర్జుమా చేయబడింది.